మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట

# ఇంటర్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలి

**గద్వాల మర్చి2, ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరు, ఫ్లయింగ్, సెట్టింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ తదితర వివరాలను పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు మరియు ఇతర సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. వైద్య సిబ్బంది పరీక్షలు ముగిసే వరకు అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష అనంతరం జవాబు పత్రాలు సహా ఇతర అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సురక్షితంగా సంబంధిత తపాలా కార్యాలయంకు పంపించాలన్నారు. అనంతరం పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈపర్యటనలో చీఫ్ సూపరింటెండెంట్ రాజేశ్వర్, పరీక్ష కేంద్రం ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పరిక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలి

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలలను జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో వైరల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లను సంబంధిత శాఖాధికారులు తప్పనిసరిగా సందర్శించాలని సూచించారు. జిల్లా అధికారులు తమకు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలలు, వెల్ఫేర్ హాస్టళ్లకు వెళ్లి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలని, హాస్టళ్లలో ఉన్న వాతావరణాన్ని పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు, వారితో కలిసి మధ్యాహ్న భోజనం లేదా రాత్రి భోజనం చేయాలని సూచించారు. హాస్టళ్లలో పరిశుభ్రత, పారిశుధ్యం సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించాలని, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం పరిశుభ్రంగా, నాణ్యంగా ఉందో లేదో తనిఖీ చేయాలని ఆదేశించారు. భోజనం విద్యార్థులకు వడ్డించే ముందు సూపర్వైజర్ తప్పనిసరిగా రుచి చూసి నిర్ధారించాలనే నిబంధన అమలవుతోందో లేదో చూడాలని తెలిపారు. అధికారులు సందర్శనలో గుర్తించిన సమస్యలు, అవసరాలను ప్రభుత్వం అందించిన గూగుల్ ఫారమ్‌లో నమోదు చేసి వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్శన కార్యక్రమాన్ని ఈ నెల 5వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాలు ర్యాలీలు నిషేధం

### అతిక్రమిస్తే కఠిన చర్యలు

### జిల్లాలో నెలరోజుల పాటు పోలీస్ యాక్ట్

### మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ వెల్లడి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 2 ప్రభాతవార్త :** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా మార్చి 1వ తేదీ ఉదయం 6 గంటల నుండి 31వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



జిల్లా ఎస్పీ జానకి ధరావత్



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**గద్వాల మార్చి 2, ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రతి అధికారి ప్రాధాన్యతనిస్తూ తమ శాఖల పరిధిలో వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారుల – మిగతా4లో..

### ఆదాయంపై ఉన్న శ్రద్ధ

## పారిశుధ్యంపై ఏది..



**అపరిశుభ్రతకు కేరాఫ్‌గా జడ్చర్ల బస్టాండ్**

**హోటల్ మురుగునీరు బస్టాండ్‌లోకి**

**పట్టించుకోని అధికారులు**

బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగు



**జడ్చర్ల, మార్చి 2 ప్రభాతవార్త :** జడ్చర్ల కొత్త బస్టాండ్ అపరిశుభ్రతకు కేరాఫ్‌గా నిలుస్తున్నది. ఆదాయంపై ఉంచిన శ్రద్ధ ఆర్టీసీ అధికారులు పరిశుభ్రతపై ఉంచడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొత్త బస్టాండ్‌లోని హోటల్ నిర్వాహకులు వంటగది నుంచి వచ్చిన వ్యర్థాలను మరుగు నీటిని దర్జాగా బస్టాండ్ ఆవరణలోకే వదలడంతో అపరిశుభ్రతగా మారుతున్నది. దోమలు ఈగలు వ్యాప్తి చెందడంతో ఆ ప్రాంతం అంతా మురుగునీటితో కంపు కొడుతున్నది. హోటలుకు మరోవైపు టాయిలెట్స్ ఉండడంతో అటువైపుగా వెళ్లేవారు ముక్కు మూసుకొని ముందుకు సాగాల్సి వస్తున్నది. హోటల్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాల్సిన నిర్వాహకులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇటు ఆర్టీసీ అధికారులు సైతం చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు మురుగునీరు బస్టాండ్ ఆవరణలోకి కాకుండా డ్రైనేజీలోకి మళ్లించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## రంగుల కేళి హోళీ

- చిన్నా,పెద్దా తారతమ్యం లేకుండా ఆడే రంగులకేళి
- చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా హోళీ
- కామదహన(కాముని) పండుగగా హోళీ
- హోళీ పండుగ నేడు



**భూత్పూర్, మార్చి 2,ప్రభాతవార్త :** చిన్నా,పెద్దా అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆడే రంగులకేళి హోలీగా చెబుతారు. హోళీ పండుగను కామదహన పండుగగా పిలుస్తారు. హైందవ సాంప్రదాయం ప్రకారం ప్రతీ ఏటా ఫాల్గుణ మాసం, వసంత రుతువు, శుక్లపక్ష పౌర్ణమి రోజున హోళీ పండుగను జరుపుతారు. ఏడాదిలో ఒక్కసారే పూసి వికసించే మోదుగ పువ్వుతో పొడిని తయారు చేసి రంగులుగా మార్చి చల్లుకుంటారు. రుతువులు మారుతుండడంతో చర్మసంబంధమైన జబ్బులు వస్తుండడంతో ప్రకృతి సిద్ధమైన మోదుగ, పసుపు, కుంకుమ వంటి సహజసిద్ధమైన పొడులు తయారు చేసుకుని పసుపు నీటితో రంగులు చల్లుకుంటుడడం వెనక హోళీ అంతరార్థముంది. హోళీ పండు పండుగ వెనక చాలా పురాణగాథలున్నాయి. పూర్వం హిరణ్యకశ్యపుడనే రాక్షసుని సోదరి హోళిక అగ్నికి ఆహుతైన రోజు హోళీని జరుపుతారు. హోళీ పండుగ గురించి పురాణగాథలు కొన్ని లేకపోలేవు. వైకుంఠంలో శ్రీమహావిష్ణువుకు ద్వారపాలకులుగా జయవిజయులుండేవారు. విష్ణుమూర్తి దర్శనార్థం వచ్చిన బ్రహ్మ మానస పుత్రులైన సనత్‌కుమారులను అహంకారంతో జయవిజయులు అడ్డగిస్తారు. కోపోద్రేక్తులైన సనత్‌కుమార్‌లు జయవిజయుల్ని భూలోకంలో రాక్షసులై (అసురులై)జన్మిస్థారని శాపం ఇస్తారట. తమ తప్పును మన్నించి తమను శాపవిముక్తుల్ని చేయాలని సనత్‌కుమార్‌లను జయవిజయులు వేడుకోగా, శాంతించిన సనత్‌కుమారులు భూలోకంలో ఏడుజన్మలు – మిగతా4లో..

## కవయిత్రి మొల్ల జయంతి అధికారికంగా నిర్వహించాలి

### సిఎంఓలో వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 2 ప్రభాతవార్త :** తొలి తెలుగు కవయిత్రిగా చిరస్మరణీయ స్థానం పొందిన ..కవయిత్రి మొల్ల ..(ఆతుకూరి మొల్లమాంబ) జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లోని సిఎంఓ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కవయిత్రి మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి దృష్టికి ఇప్పటికే తీసుకుపోవడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. ప్రభుత్వ పరంగా జయంతి వేడుకల ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. మొల్ల రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో ఒక అపూర్వ కావ్యమని తెలిపారు. సాధారణ ప్రజలకు అర్థమయ్యే సులభమైన భాషలో రామాయణాన్ని రచించడం ద్వారా ఆమె తెలుగు భాషకు కొత్త దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. మధ్యయుగ కాలంలోనే మహిళగా సాహిత్యరంగంలో ప్రవేశించి, తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందడం ఎంతో గొప్ప విషయమని, ఆమె జీవితం నేటి మహిళలకు ఆదర్శమని అన్నారు. సమాజంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని మొల్ల జీవితం మనకు తెలియజేస్తుందని తెలిపారు. గత సంవత్సరం కవయిత్రి మొల్ల విగ్రహాన్ని మహబూబ్ నగర్ నగరం లో ఏర్పాటు చేసి, ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మొల్ల జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం ద్వారా తెలుగు సాహిత్య వారసత్వానికి మరింత గౌరవం లభిస్తుందని, పాఠశాలలు, కళాశాలల్లో సాహిత్య చైతన్యం పెరుగుతుందని, మహిళా రచయితలకు సైతం ప్రోత్సాహం లభిస్తుందని, యువతలో భాషా ప్రేమ పెంపొందుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. మొల్ల పేరుతో రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారం ఏర్పాటు చేయడం, జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సాహిత్య సదస్సులు, వ్యాసరచన, కవితా పోటీలు నిర్వహించడం వంటి చర్యలు తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. తెలుగు సంస్కృతి, సాహిత్య పరిరక్షణలో భాగంగా మొల్ల గారి జయంతిని ప్రతి సంవత్సరం అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని, ఆమె విగ్రహాల ప్రతిష్ఠాపన, గ్రంథాలయాలలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. మొల్ల సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.



సిఎంఓలో వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### ఆన్లైన్ లో మండల తహశీల్దార్, ఎంపిడిఓలతో మాట్లాడి సమస్యల పరిష్కారంకు కలెక్టర్ ఆదేశాలు

### ప్రజావాణిలో దరఖాస్తులు 148 స్వీకరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 2 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరం పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియలతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన వినతులు స్వీకరిస్తూ వారు చెప్పిన సమస్యలు సావధానంగా విని సమస్యల పరిష్కారంకు అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మండల తహశీల్దార్‌లు, ఎం.పి.డి.ఓలతో సంబంధిత మండలసమస్యలు ఫిర్యాదులు స్వీకరించి వారితో ఆన్లైన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తహశీల్దార్, ఎం.పి.డి.ఓ, ఎం.పి.ఓ సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమంకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కారంకు చొరవ చూపాలని సూచించారు. మిడ్జిల్ మండల తహశీల్దార్ ,ఎం.పి.డి.ఓలతో మాట్లాడి పాఠశాల ఆక్రమణ, పెన్షన్ సంబంధించిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు వివయో వృద్ధులు తమ కుమారుడు నిరాదరణకు గురైన వారు ఫిర్యాదులపై ఆర్.డి.ఓ కు ఆదేశాలు జారీ చేశారు. ల్యాండ్ సర్వే, రెవిన్యూ, గృహ నిర్మాణం, వృద్ధాప్య పెన్షన్ లు, మున్సిపాలిటీ, పంచాయతీ, ఇతర శాఖల సంబంధించిన వివిధ సమస్యలపై 148అంది ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందచేశారు. ఇంచార్జిస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ సి.ఎం.ప్రజావాణి, ప్రజావాణి లో వచ్చిన పెండింగ్‌లో నున్న ఫిర్యాదులు వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు జిల్లా అధికారులు తమకు కేటాయించిన గురుకులాలు, హాస్టల్‌లు ఫిబ్రవరి మాసంకు సంబంధించి తనిఖీలు పూర్తి చేయాలని ఆయా అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డిఆర్.డి.ఓ నర్సింహులు, ఆర్.డి.ఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

**నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎస్.పి.రెవెన్యూ అధనపు కలెక్టర్,అధికారులు.**

నూతన కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో ఎస్.పి. డి.జానకి, రెవెన్యూ అధనపు కలెక్టర్ హరిప్రియ, ఆర్.డి.ఓ నవీన్, జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని సునీత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె. కృష్ణ, జిల్లా సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగా అజ్మీరా, బి.సి.సంక్షేమ శాఖ అధికారిని ఇందిర, మత్స్య శాఖ అధికారిని రాధా రోహిణి, ఎల్.డి.ఎం. చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు కలిసి మొక్క, పుష్పగుచ్ఛంలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.



సత్యనారాయణ స్వామి వ్రతంలో నూతన దంపతులు

### తుమ్మన పేట గ్రామంలో

## పెళ్ళి సందడి

### స్వగ్రామంలో హీరో విజయ్ దేవరకొండ - రష్మిక మందానకు ఘన స్వాగతం

### సొంతూరులో ఆత్మీయ ఆహ్వానం - నవ దంపతులకు

### జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల ఆశీర్వాదాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 2 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మనపేట గ్రామంలో నూతన దంపతులు విజయ్ దేవరకొండ-రష్మిక మందాన తమ స్వగ్రామాన్ని సందర్శించడంతో గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. గ్రామ ముఖ ద్వారం వద్ద తెల్లవారుజామున నుంచే అభిమానులు, గ్రామస్తులు భారీగా గుమిగూడి పూలమాలలు, హర్షధ్వానాలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలతో స్వాగత ఏర్పాట్లు చేశారు. డప్పు వాయిద్యాలు, కోలాటాల నృత్యాల మధ్య నూతన జంటకు ఆహ్వానం పలికారు. చిన్నారులు నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమ గ్రామానికి గర్వకారణమైన విజయ్‌ను, ఆయన సతీమణి రష్మికను ఒక్కసారి చూడాలని ఆసక్తిగా తరలివచ్చారు. మహిళలు మంగళహారతులు పట్టి సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. గ్రామ వీధులు రంగవల్లులతో అలంకరించబడి పూలతోరణాలతో శోభాయమానంగా కనిపించాయి. ఉదయం 11:15 గంటలకు నూతన దంపతులు వేదమంత్రాల మధ్య తులసిమాతకు ప్రత్యేక పూజలు – మిగతా4లో..



పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న 10వ తరగతి ప్రశ్న పత్రాలు

### పోలీస్ స్టేషన్‌కు చేరిన

## పది ప్రశ్నా పత్రాలు

**వెల్దండ, మార్చి 2 ప్రభాతవార్త:** ఈనెల 14వ తేదీ నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహించే 10వ తరగతి ప్రశ్నాపత్రాల మొదటి సెట్టు సోమవారం పరీక్షల నిర్వహణ విద్యాధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు బందోబస్తు మధ్య పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ పేపర్ కస్టోడియను అధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 160 మంది, మాడల్ పాఠశాలలో 171 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, రవీందర్, శేఖర్, శ్రీను, బాలేశ్వర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## కన్నతల్లే కడతేర్చింది

### కాపురానికి అడ్డు వస్తున్నాడని హత్య

### రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**బిజినేపల్లి, మార్చి 2 ప్రభాతవార్త:** మాతృత్వం మంట కలిసింది కడుపులో పెట్టుకొని చూసుకోవలసిన కన్నతల్లి కసాయిగా మారింది . మూడు నెలల పసికందు అని కనికరం లేకుండా కాపురానికి అడ్డొస్తున్నాడని నీటి తొట్టిలో వేసి హతమార్చింది. పాలెం గ్రామంలో శనివారం తెల్లవారుజామున మూడు నెలల బాలుడు అనుమానాస్పద మృతి చెందిన సంఘటన లో కాపురానికి అడ్డుగా వస్తున్నాడని కన్నతల్లే కడతేర్చిందని డిఎస్పి బుర్రి శ్రీనివాస్ వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాలెం గ్రామానికి చెందిన ఉల్లం గొండ్ల నీలమ్మ ను పానగల్ మండలం శాగాపూర్ గ్రామానికి చెందిన గుర్రంకొండ నరేంద్రకు 10 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం చేసినట్లు తెలిపారు. వివాహానంతరం వీరికి ఇద్దరు పిల్లలు. గత రెండేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు తలెత్తడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తుంది. అప్పుడప్పుడు భర్త నరేందర్ అత్తగారింటికి వచ్చి భార్యను కాపురానికి రమ్మని ప్రాధేయపడేవాడని వివరించారు. అత్తగారింటికి వెళ్లడం ఇష్టంలేని – మిగతా4లో..



బాలున్ని కడతెర్చిన కన్నతల్లి నీలమ్మ

### శాసనసభ సభాపతి పదవికి వన్నెతెచ్చిన

## మహోనీయుడు దుద్దిళ్ళ శ్రీపాదరావు : కలెక్టర్



శ్రీపాదరావు చిత్ర పటానికి నివాళ్ళు అర్పిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

**గద్వాల మార్చి 2, ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీ య దుద్దిల్ల శ్రీపాదరావు 89వ జయంతి సం దర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం ఐడిఓసి ఆవరణలో శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఇతర అధికారులతో కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల లు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీపాద రావు ప్రజాసేవకు అంకితమై, శాసనసభ స్పీకర్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. సభ గౌరవ, మర్యాదలను కాపాడటంలో కీలకపాత్ర పోషించారన్నారు. శ్రీపాద రావు ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవకు అంకితభావంతో ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవ కరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డిఓ శ్రీనివాస రావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, పలువురు జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా రాత్రివేళలో ఫిల్టర్ ఇసుక తరలింపు

### ట్రాక్టరును సీజ్ చేసిన పోలీస్ అధికారులు

**నవాబుపేట, మార్చి 2 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మహబూబ్‌నగ రూరల్ శివారు పేరుతో అక్రమంగా ఫతేపూర్ లో రాత్రి వేళల్లో ఫిల్టర్ ఇసుకను అక్రమార్కులు ధనార్జనే లక్ష్యంగా దందా సాగిస్తున్నారు. మార్చి 1 ఆదివారం సాయంత్రం ఫతేపూర్ గ్రామానికి చెందిన శేఖర్ గౌడ్ ఫిల్టర్ ఇసుకను తయారుచేసి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని కాకర్లపాడు, రుద్రారం, కొండాపూర్ గ్రామాలకు సరఫరా చేస్తున్న క్రమంలో నవాబుపేట పోలీస్ అధికారులకు సమాచారం రాగా ఫిల్టర్ ఇసుక ట్రాక్టరును పట్టుకొని స్టేషనుకు తరలించారు. ట్రాక్టర్ నెంబర్ టిఎస్ 06 యుసి 5297 గల ట్రాక్టరు ఫతేపూర్ గ్రామానికి చెందిన కళాల్ శేఖర్ గౌడ్ కి చెందినదిగా విచారించి శేఖర్ గౌడ్ ను ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా వేరే మండలం శివారు పేరుతో ఇసుక దందాను ఫతేపూర్ లో కొందరు ఫిల్టర్ ఇసుక రవాణా దారులు యదేచ్ఛగా పగలంతా ఫిల్టర్ చేసి రాత్రి వేళల్లో చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా చేసి డబ్బులు దండుకుంటున్నారు. ఫతేపూర్ రూరల్ మండలం కావడంతో అడ్డు అదుపు లేకుండా ఇసుక మాఫియా జరుగుతుంని చుట్టుపక్కల గ్రామస్తులు వాపోతున్నారు.

## హామీలు నెరవేర్చాలి

### లేదంటే అడుగడుగునా కాంగ్రెస్‌ను అడ్డుకుంటాం

### మహబూబ్ నగర్ జిల్లా ఆటో జేఏసీ అధ్యక్షుడు ఎండి షేఖ్ బాబుమియా

**మహబూబ్‌నగర్, మార్చి2 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలి లేదంటే అడుగడుగునా కాం గ్రెస్ పార్టీని అడ్డుకుంటామని మహబూబ్ న గర్‌జిల్లా ఆటో జేఏసీ అధ్యక్షుడు ఎండి షేఖ్ బాబుమియా తేల్చి చెప్పారు. మహబూబ్ నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్ మీయా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ. 1000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని మూడు సంవత్సరాలు గడుస్తున్న గాని ఇంతవరకు ఆటో డ్రైవర్లకు న్యాయం చేయలేదన్నారు. తక్షణమే ఈ నెల 16నుంచి జరుగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆటో డ్రైవర్లకు బడ్జెట్ కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆటో డ్రైవర్ ఆగ్రహానికి గురికాక తప్పదని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏ రాజు, నగేష్, పజిల్, రాజు, శ్రీనివాస్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమం

### సాంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థులు

**శ్రీరంగాపూర్, మార్చి 2 ప్రభాతవార్త :** శ్రీరం గాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీరం గాపూర్ మండల విద్యాధికారి హనుమంతు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు లు తెలంగాణ హర్యా న రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. తెలంగా ణహర్యానా రాష్ట్రాలకు సంబంధించిన వంటకాలు ప్రదర్శించి. ఉమ్మడిరాష్ట్రాల సాంస్కృతిక పాటల నృత్యాలతో విద్యార్థులు అలరించారు. జాతీయ సమైక్యత పెంపునకు ఉద్దేశించి ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహ ఈ కార్యక్రమాన్ని విదేశించి ప్రధానోపాధ్యాయులు మోహన్ రాజు మాట్లాడుతూ 2015అక్టోబర్ 31న దేశ ప్రధానమంత్రి వివిధ రాష్ట్రాల సాంస్కృతిక ఆహార వైవిధ్యాలను గౌరవిస్తూ భిన్నత్వంలో ఏకత్వం పెంపొందించడానికి ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వసంతపురం రాజు దామోదర్ బాబు సమ్రిన్ బేగం బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ బేగం ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఆయా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వాటర్ బాటిల్స్, పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**చిన్న చింతకుంట, మార్చి 2 ప్రభాతవార్త :** మండలంలోని లాల్ కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు క్లాస్ మెంట్ క్లబ్, అవోపా సౌజన్యంతో వాటర్ బాటిల్లు, పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేసినట్లు మం డల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ బాటిళ్ళను అందిం చడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు వాటర్ బాటిల్, పరీక్ష ప్యాడ్ లను అందించి నందుకు క్లాస్మేట్ క్లబ్, అవోపాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏపిసి చైర్మన్ శ్రీమతి అరుణ, మహిళా సంఘ సభ్యులు జ్యోతి ,పాఠశాల ఉపాధ్యాయ బృందం గంగయ్య, శ్రీనివాస్, జయలక్ష్మి, సావిత్రి, ఈశ్వరయ్య, సుమన, సిఆర్‌పి విజయసింహ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కలకు ఆహారంగా

# మృతదేహం..!

### జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో

### అమానుష ఘటన

### కనీస భద్రతా చర్యలు శూన్యం

### బాధ్యులపై చర్యలు

### తప్పవు: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



మృతదేహాన్ని కుక్కలు తింటున్న దృశ్యం

**జడ్చర్ల, మార్చి 2 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని నాగసాల గ్రామానికి చెందిన భీమేష్ చెరువులో పడి దురదృష్టవశాత్తు మృతిచెందారు. అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే మృతుడి పార్థివ దేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం అక్కడ కనీస భద్రత లేకపోవడంతో పార్థివ దేహం కుక్కల పాలైంది. మృతదేహాన్ని శునకాలు ఆరగిస్తున్న హృదయ విదారక ఘటన అందరినీ కలచివేసింది. మనిషి మృత దేహాన్ని పీక్కు తింటున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మన జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

**బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు...**

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక**

జడ్చర్ల మున్సిపాలిటీలోని నాగసాల గ్రామానికి చెందిన భీమేష్ చెరువులో పడి దురదృష్టవశాత్తు మృతిచెందిన ఘటనపై జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో మరింత బాధాకరమైన అంశం ఏమిటంటే, మృతుడి పార్థివ దేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం అక్కడ కనీస భద్రతా మరియు పారిశుధ్య సదుపాయాలు లేక పోవడం వల్ల శవం కుక్కలకు ఆహారంగా మారడం అమానుషమని తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజ నర్సింహతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు విశ్వాసం కలిగించేలా, మానవీయ విలువలను కాపాడేలా పనిచేయాలని, ఇలాంటి అమానుషఘటనలు ప్రజల్లో భయం, అవిశ్వాసాన్ని కలిగిస్తాయని అన్నారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు ఈఅంశాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే, కూచు కుళ్ళ రాజేష్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావుల దంపతులు



అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం

**ఉప్పునుంతల,మార్చి 2 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు గరుడవాహన సేవ ,మోహిని సేవ, ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచు కుళ్ళ రాజేష్ రెడ్డి దంపతులు, ఆలయ ఉత్సవా కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు దంపతులు పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితుల మధ్య కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వధువు తరఫున, కూర్చొని కళ్యాణాన్ని జరిపించారు. శ్రీ లక్ష్మీ నరసింహ కళ్యాణాన్ని తిలకించడానికి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచు కుళ్ళ రాజేష్ రెడ్డి దంపతులు, నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు దంపతులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, అచ్చంపేట పోలీస్ డివిజన్ అధికారి పల్లె శ్రీనివాసులు, అచ్చంపేట సీఐ నాగరాజు, తహసీల్దార్ అద్దంకి సునీత, వంగూర్ ఉప తహసీల్దార్ ఎలుక సుదర్శన్ రెడ్డి, ఎస్ ఐ వెంకట్ రెడ్డి, ఇఓ నర్సింహులు, నాయకులు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రామస్వామి గౌడ్, అర్జున్ రావు, మర్యాద దామోదర్, బాల్ రావు, గ్రామ సర్పంచ్ మొకురాల మోహన్ గౌడ్, అనంత ఇంద్రసేనారెడ్డి, తెలకపల్లి కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం నాయకురాలు విజయలక్ష్మి, తాత్కాలిక పాలక మండలి సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి లు, వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి భరోసా




మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డా.మెర్సీ

**నారాయణపేట, మార్చి 2 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.మెర్సీ వసంత, కళాశాల టాస్క్ కోఆర్డినేటర్ సుజాత్ అలీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ జాబ్ మేళాలో హెటెరో టాటా గ్రూప్ మెడ్ ప్లస్ అరోబిందో ఫార్మా పేటీఎం తదితరంగా మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 680 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి, అందులో 164 మంది యువతీ యువకులను వివిధ కంపెనీలు ఎంపిక చేశాయి ఎంపికైన వారికి కళాశాల ప్రాంగణంలోనే నియామక పత్రాలు అందజేశారు ఎంపికైన అభ్యర్థులకు నెలకు సుమారు రూ.20,000 నుండి రూ.35,000 వరకు వేతనం చెల్లించేందుకు సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ మెర్సీ వసంత మాట్లాడుతూ, విద్య పూర్తయిన వెంటనే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ముఖ్య లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి జాబ్ మేళాలను నిర్వహించి మరింత మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో టాస్క్ జిల్లా కోఆర్డినేటర్ సిరాజుద్దీన్, సతీష్, కళాశాల అధ్యాపకులు రాజ్ కుమార్, లక్ష్మా రెడ్డి, విశ్వనాథ్, శ్రీనివాస్, డాక్టర్ కవిరాజు, ప్రకాష్, సంగీత సునీత, కావ్య, కృష్ణయ్య, ప్రభాకర్, రామకృష్ణారెడ్డి, కిషోర్, అశోక్, సురేఖ, రవీందర్ రెడ్డి తదితరులు మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రిన్సిపల్ డా. మెర్సీ వసంత కృతజ్ఞతలు తెలిపారు.




ధ్రువీకరణ పత్రాలతో సెలక్షన్ అయిన అభ్యర్థులు

## పాఠశాలకు స్పీకర్ బాక్స్ అందజేత



స్పీకర్ బాక్స్ ను అందజేసిన మాజీ చైర్మన్ రామస్వామి గౌడ్

**ఉప్పునుంతల, మార్చి 2 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి పాఠశాలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ రామస్వామి గౌడ్ స్పీకర్ బాక్స్‌ను వితరణ చేశారు. దీంతో పాఠశాల సిబ్బంది ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత రామస్వామి గౌడ్ తో పాటు గ్రామ సర్పంచ్ మోహన్ గౌడ్, ఉప సర్పంచ్ పాణం సైదులు, వార్డు సభ్యులు దుడ్డు శేఖర్ యాదవ్, పాఠశాల సిబ్బంది, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 21 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

**నారాయణ పేట, మార్చి 2 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 21 ఫిర్యాదులు అందాయి. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమం

**ఉప్పునుంతల,మార్చి 2 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి సోమవారం జరిగిన కళ్యాణోత్సవం తిలకించేందుకు భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు ఉప్పునుంతల మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి వారి సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అధికారులు, వివిధగ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి లీగ్ పోటీలు



సైక్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, మార్చి 2 ప్రభాతవార్త :** అస్మిత ఖే లో ఇండియా రాష్ట్ర స్థాయి ఉమెన్స్ రోడ్డు స్పీడ్ సైకిలింగ్ లీగ్ పోటీలు, సౌత్ జోన్ ఖే లో ఇండియా సైకిలింగ్ కోఆర్డినేటర్, ఇండియా సైకిలింగ్ కోచ్ లు డాక్టర్ మాక్స్వెల్, ఎం కె. పాషా, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈనెల 1న బండ్లగూడ నాగోల్ వాటర్ బోర్డ్ సెంట్రల్ గ్రౌండ్లో జరిగిన , రాష్ట్రస్థాయి మహిళల సైక్లింగ్ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 272 మంది సైకిల్ రైడర్స్ పాల్గొనగా, నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్రాంత పిఈటి బి.గోపాలం ఆధ్వర్యంలో జిల్లా నుండి బాలికలు, మహిళలు 58 మంది పాల్గొని, మహిళల 15 కిలోమీటర్ల సైకిలింగ్ పోటీలలో నారీ శక్తిని ప్రదర్శించి పేదింటి సి. బోయ రాధమ్మ (నర్వ) వెండి పతకం, తండ్రి లేని పేదింటి బిడ్డ టి. అనూష కాంస్య పథకం, అలాగే 18 సంవత్సరాలలోపు బాలికల 10 కి.మీ పోటీలలో నల్లమల గిరిజన బాలిక నేతావత సంజన (నర్వ గురుకుల) 4 వ స్థానం సాధించి రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా, ఇండియా సైకిలింగ్ కోచ్ డాక్టర్ మాక్స్వెల్, డాక్టర్ పాషా ద్వారా ప్రశంసా పత్రము, మెడల్ అందుకున్నట్లు కోచ్ బి.గోపాలం సంతోషాన్ని వ్యక్తపరుస్తూ తెలిపారు. అలాగే 16 సంవత్సరాల లోపు 5 కిలోమీటర్ల బాలికల సైకిలింగ్ పోటీలలో 5 నుండి 19వ స్థానం వరకు వరుసగా వి. తేజశ్రీ ,ఎం. హారిక, జి. కావేరి ,జె .శివాని ( నర్వ గురుకుల) కే .త్రివేణి (ముడుమల్) కే. సిరి ప్రార్థన (ఆత్మకూర్) ఏ. మమత, కే. నందిని, బి .శ్రీ మహాలక్ష్మి, కె. దీక్షి త, కె .అశ్విని( శ్రీ గీతం మక్తల్) డి. భవాని, టీ .సౌజన్య, సి.దుర్గా, ఆర్. అశ్విని, కే .అర్చన(జడ్.పి.హెచ్.ఎస్ నర్వ) కే .శివలక్ష్మి, వి. చందన (నేరేడుగాం)వి. మేఘన ( ఘనపూర్) 3 కిలోమీటర్ల కిడ్స్ విభాగంలో కె .వేద విశిష్ట 4వ స్థానం (ఆత్మకూర్) అక్షయ 5వ స్థానం (శ్రీ గీతం స్కూల్ మక్తల్) బాలికలు ప్రశంసా పత్రాలు పొందినట్లు బి.గోపాలం తెలిపారు. అస్మిత ఖే లో ఇండియా ఉమెన్స్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో 58 మంది బాలికలు నారాయణపేట జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నందుకు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలమును ఇండియా కోచ్ డాక్టర్ మాక్స్వెల్ పొగుడుతూ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బి. శిల్ప, పీడీలు మీనా కుమారి, అవంతి, చంద్రకళ పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలలో మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందిన మహిళలను, బాలికలను తాన్ సింగ్, బి .గోపాలం, పాఠశాలల పిడీలు డాక్టర్ రజిని, స్వరూప, శ్రీవాణి, అభినందించారు.

## చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి



బాలింతలకు గుడ్లు అందజేస్తున్న సర్పంచ్

**చిన్నచింతకుంట,మార్చి 2 ప్రభాతవార్త :** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సర్పంచ్ తెలుగు శివకుమార్ సూచించారు. సోమవారం పర్దిపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులకు సక్రమంగా అందించి వారిలోని రక్తహీనతను తొలగించి మంచి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్ది విద్యపై ఆసక్తి పెరిగేలా అంగన్వాడి కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. గ్రామంలోని బాలింతలకు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని వారికి గుడ్లు, బాలామృతాన్ని అందజేశారు. అంగన్వాడి కార్యకర్తలు తమ విధుల పట్ల అలసత్వం వహిస్తే ఉన్నతాధికారులకు తెలుపుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నీరెంటీ నరసింహారెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

## విద్యా కమిషన్ నివేదిక అశాస్త్రీయం

### ఆకునూరు మురళి ప్రకటనలు ఉపాధ్యాయుల

### ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయి

### వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలి

### డీటీఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వామన్ కుమార్



**మహబూబ్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** పాఠశాల కమిషన్ ఏదో సాధించామని ప్రభుత్వానికి తప్పుడు నివేదిక సమర్పించడాన్ని డిటిఎఫ్ సంఘం ఖండిస్తున్నదని రాష్ట్ర కౌన్సిలర్ వామన్ కుమార్ ఈ సంస్థ తన పని విధానాల్లో భాగంగా అనేక పాఠశాలలు సందర్శించి అక్కడున్నటువంటి లోపాలు చూసి వాటిని సవరించే సూచనలు చేయాల్సిందే కానీ తనకు లేని అధికారాన్ని చూయిస్తూ ఉపాధ్యాయులకు అధిక జీతాలు ఉన్నాయని వాటిని తగ్గించి ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవాలని సలహా ఇవ్వడం శోచనీయం అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు వచ్చాయి కులాల పేరుతో, మతాల పేరుతో విభజించి పాలిస్తూ విద్యార్థులలో విషబీజాలు నాటుతున్నారు . హాస్టల్ విద్యార్థుల స్థితిగతుల గురించి ఎన్నో పత్రికల్లో వస్తున్నాయి టాయిలెట్స్ లేని పాఠశాలలు బాత్రూంలే లేని పాఠశాలలు స్నానానికి నీళ్ల లేని హాస్టల్స్ అనేకం ఉన్నాయి. అక్కడ చాలా వెనుకబడిన బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అరకొర వసతులతో విద్యను కొనసాగిస్తున్నారు. అలాంటివి మీకు కనిపించవా అని ప్రశ్నించారు. విద్యారంగానికి ప్రభుత్వం కేటాయించిన నిధుల శాతం ఎంత అందులో ప్రభుత్వం ఖర్చు చేయకుండా తిరిగి మిగిలించుకున్న సందర్భాలు ఎన్నో వాటిని మీరు గమనంలోకి తీసుకోలేదు. ప్రస్తుతం మన విద్యా వ్యవస్థకు అటు కేంద్రాల్లో ఇటు రాష్ట్రంలో కూడా అతి తక్కువ శాతం బడ్జెట్ కేటాయిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ ముందుకు సాగడం కష్టం. ఇప్పటికీ అన్ని జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు లేరు మండల విద్యాశాఖ అధికారులు లేరు విద్య గురించి దాని శిక్షణ బోధనా అంశాల గురించి తెలియని అనుభవములేని నాన్ టీచింగ్ స్టాఫ్ ను ఇంఛార్జీలుగా నియమించి కొనసాగిస్తున్నారు. దీనివల్ల వారి పర్యవేక్షణ అంతంత మాత్రమే వీటిని కూడా మీరు పరిగణలోకి తీసుకోలేదు. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయి. వాటిని భర్తీ చేయకుండా పాఠశాలల రేషనలైజేషన్ చేయమని కోరడం సరైనది కాదు. ఉపాధ్యాయులకు విద్యేతర కార్యక్రమాలు అప్పగిస్తున్నారని వీటిని అప్పగించవద్దని ఎక్కడ ఖండించలేదు. ఈ మధ్యనే రెండు ఎన్నికలు జరిగాయి. కొన్నిచోట్ల నామినేషన్‌తో మొదలై ఎన్నికల ఫలితాల వరకు ఐదు డ్యూటీలు చేసిన ఉపాధ్యాయులు దాదాపు నెల 15 రోజులు పాఠశాలకు దూరమయ్యారు. ఆ సమయంలో విద్యార్థులు, వారికి కావలసిన సిలబస్ గురించి ఆలోచించలేదు. ప్రతి సర్వే ఉపాధ్యాయులకే, ఓటర్ లిస్టు ఉపాధ్యాయులకే ఇలాంటివి మీరు ఏరోజు వ్యతిరేకించలేదు అన్నారు.

## గ్రామ సభలో బాలల హక్కులపై అవగాహన



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, మార్చి 20 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా మల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో బాల్యవివాహాలు, బాల్యకార్మికంపై కఠిన చర్యలు - 1098కు సమాచారం ఇవ్వాలి అలాగే మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ విజయ్ కుమార్ హాజరై బాలల హక్కులు మరియు బాలల సంరక్షణ చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం 18 సంవత్సరాలు నిండని అమ్మాయి, 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి వివాహం జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరగనున్నట్లు సమాచారం ఉంటే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు అలాగే బాల్యకార్మిక నిషేధ చట్టం, విద్య హక్కు చట్టం, అనాథ బాలల సంరక్షణ, బాలికల ప్రాముఖ్యత, పిల్లలను లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం -2012 మిస్సింగ్ చైల్డ్ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్నా 1098 నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కథలప్ప, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు

## ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

**నారాయణపేట, మార్చి2 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలో సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, శాసనసభ స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు శ్రీపాదరావు అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. 1935 మార్చి 2న జన్మించిన శ్రీపాదరావు విద్యార్థి దశ నుంచే ప్రజాసేవలో చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు మంథని నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారని, అనంతరం శాసనసభ స్పీకర్‌గా నిష్పాక్షికంగా సేవలందించారని చెప్పారు. గ్రామాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు1999 ఏప్రిల్13న జరిగిన దుర్ఘటనలో ఆయన మరణించినప్పటికీ, ప్రజా స్వామ్య పరిరక్షణలో చూపిన అంకితభావం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### లార్వా నిర్మూలన డ్రైవ్‌కు శ్రీకారం చుట్టిన గ్రామ సర్పంచ్

**దేవరకద్ర, మార్చి 2 ప్రభాతవార్త:** గ్రామాభివృదే నా లక్ష్యం అని కౌకుంట్ల మండల సర్పంచ్ నరేష్ కుమార్ స్పష్టం చేస్తూ, ప్రజల సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కౌకుంట్ల మండల కేంద్రంలో సోమవారం దోమలనివారణకు గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ ప్రత్యేక లార్వా నిర్వహణ డ్రైవ్ నిర్వహించారు. కాలువలు, చెరువులు, నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో పరిశీలనలు చేపట్టి, లార్వి సైడ్ మందులు పిచికారి చేశారు. గ్రామంలో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి వార్డు ప్రజలతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానన్నారు. దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులను అరికట్టడమే ఈ డ్రైవ్ ప్రధాన లక్ష్యం అని, గ్రామాన్ని ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడతానని గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, వార్డ్ నెంబర్ రవీందర్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షులు ఎండి నజీర్, కాంగ్రెస్ నాయకులు తుమ్మల నరసింహారెడ్డి, బేరీ నాగన్న, యువజన నాయకులు ప్రసాద్ ,మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**కెటిదొడ్డి మార్చి2, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేటి దొడ్డి మండల పరిధిలోని నందిన్నె గ్రామంలో శ్రీరాఘవేంద్ర యూపీ స్కూల్ నందు ఘనంగా "స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలు" ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరిశంకర్, జిల్లా విద్యాధికారి మైలార్ లింగ, మండల విద్యాధికారి మహేష్, ప్రధానోపాధ్యాయులు జయశంకర్ మరియు ఉపాధ్యాయులుగా, 20మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ప్రతిభ ను కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. విద్యార్థులు జిల్లా కలెక్టర్ గా. జిల్లా విద్యాధికారిగా, మండల విద్యాధికారిగా ఉపాధ్యాయులుగా చక్కటి ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంక్‌ను తొలగించాలి

- కలెక్టర్‌కు విన్నవించిన తుపత్రాల గ్రామస్తులు



**అయిజ మార్చి 2, ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని తుపత్రాల గ్రామంలో శిథిలావస్థ లోఉన్న వాటర్ ట్యాంక్ ను తొలగించాలని గ్రామానికి చెందిన ఆరో వార్డ్ కౌన్సిలర్ మహేశ్వరమ్మ వెంకన్నగౌడ్ మరియు గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌కు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం పక్కనే అతి పురాతనమైన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి సిమెంట్ పెచ్చులు ఊడి పడుతున్నాయని ఇది ఏ క్షణమైన కూలిపోయే ప్రమాదం ఉందని వారు తెలిపారు చిన్నారుల ప్రాణాలకు ముప్పుకలవక ముందే తక్షణమే వాటర్ ట్యాంక్ కూల్చివేయాలని కలెక్టర్కు విన్నవించారు. అలాగే గ్రామంలోని పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఆవరణలో సురక్షితమైన నీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని అలాగే పాఠశాలలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పునరుద్ధరించాలని కలెక్టర్ ని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలి పారు కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుమ్మరి బుడ్డన్న, టిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుల తుపత్రాల విలేజ్, వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్‌ను సన్మానించిన వాల్మీకి సంఘం నాయకులు

**అమరచింత మార్చి 2, ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ నూతన చైర్ పర్సన్‌గా ఎన్నికైన జింక సువర్ణ, ఒకటో వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన మీనిగాలక్ష్మికి సోమవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని వారి స్వగృహంలో వాల్మీకి సంఘం నాయకులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిసంఘం నాయకులు తోకలి రమేష్, కడియాల యాదగిరి, కావలి అంజనేయులు, సుధాకర్, తన గలి రాజు. తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు చేరిన పదో తరగతి పరీక్ష పత్రాలు



పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పదో తరగతి పరీక్ష పత్రాలు

**దేవరకద్ర, మార్చి 2 ప్రభాతవార్త:** పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య స్థానిక దేవరకద్ర పోలీస్ స్టేషన్ కు చేరుకున్నాయని ఎంఈఓ బలరాం, ఎస్సై నాగన్న తెలిపారు. అధికారులు ప్రత్యేక బందోబస్తు నడుమ సీల్డ్ కవర్లలో ఉన్న పత్రాలను భద్ర పరిచారు. పరీక్షల వరకు ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్ లోనే భద్రంగా ఉంచి, పరీక్ష రోజు ఉదయంసంబంధిత కేంద్రాలకు తరలించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, దేవరకద్ర పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నారు. పరీక్షల నిర్వహణ సజా వుగా సాగేందుకు, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

## అన్నదాన కార్యక్రమం

**దేవరకద్ర, మార్చి 2 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తులకు, ఆలయ పూజారి నాగరాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. వందలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం లింగయ్య, లింగమ్మ ,కుమారుడు నాగరాజు ఆలయంలో భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ సమాజంలో సేవా భావం పెంపొందించేందుకు, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని, సమాజంలో ప్రతి ఒక్కరు కూడా సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు.

## కలర్‌ఫుల్ వేడుకలు

- నేడు హోలీ పౌర్ణమి సంబురాలు
- సహజ రంగులే ఆరోగ్యానికి మేలు



**నర్వ, మార్చి 2 ప్రభాతవార్త:** హోలీ.. రంగు లకేళి. మనస్సు నిండా ఆనందాన్ని నింపే సంబురం. చిన్నాపెద్ద, పేదాధనిక తేడాలేకుండా స్నేహభావంతో రంగులు చల్లుకునే కలర్‌ఫుల్ వేడుక. మనుషులంతా ఒక్కటే అనే సందేశమిచ్చే పండుగ హోళీ. రంగులను ప్రేమగా ఒకరికొకరు ముఖాలకు పులుముకుంటూ వీధుల్లో చేసే సందడి అంతాఇంతా కాదు. అయితే ఈసారి కొంతమంది మంగళవారం, మరికొందరు భుదవారం హోలీ పండుగను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రసాయ నరంగులు వద్దని, సహ జరంగులే ఆరోగ్యానికి మేలని ఎప్పటిలాగే వైద్యులు సూచిస్తున్నారు. హోలీ సంబురాలను జరుపుకునేందుకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని కాముడి దహనం, రంగులు చల్లుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. హోలీ హోలీల రం గహోలీ.. చమ్మకేలి లహోలీ అంటూ పాటలు పాడుకుంటూ చిన్నాపెద్దా కలిసి వేడుకల్లో పాల్గొననున్నారు. సోమవారం హోళీ వేడుకలు జరుపుకోనున్నారు. సోమవారం కాముడి దహనం చేశారు. తెలంగాణలో ప్రభుత్వ సెలవు మంగళవారం కావడంతో హోలీ సంబురాలు జరగనున్నాయి. యువతరంగులను కొనుగోలుచేసే పనిలోపడ్డారు . కాలనీల్లో ఒకచోట అందరూ చేరి హోలీ రంగులు పూసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ స్నేహితుల తో ఒక్కరోజు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు రెడీ అయ్యారు.

**హోలీ పురాణమిదే :** హోలీ పుట్టుకను తెలిపే పురాణ గాథలు ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. హోలిక అనే రాక్షసి తాను నివసించే పరిసర ప్రాంతాల్లో ఉండే పిల్లలను ఎత్తుకువెళ్లి తినేస్తుంటుంది. దీంతో ఆ ప్రాంతవాసులు హోలికను కాల్చి చంపుతారు. ఆనాటి నుంచి హోలిక పేరు మీ దహోలీని జరుపుకోవడం ఆనవాయితీ.

**కామదహనం:** హోలీకి ముందు అర్ధరాత్రి కామదహనం అనాదిగా వస్తున్న ఆచారం. శరీరంలో రోగాలన్నీ మటుమాయమై అందరికీ ఆయురారోగ్యాలు చేకూరాలని ఆశిస్తూ ఇంట్లోని పాత వస్తువులు, కలపను, పేడతో చేసిన పిడకలను కూడళ్ల వద్దకు చేర్చి కామ దహనం చేస్తారు. మిగిలిన బూడిదను దిష్టి తగలకుండా బొట్టుగా పెట్టుకుంటారు.

**మోదుగు పూలరంగు:** ప్రాచీనకాలంలో రంగుల కోసం మోదుగు పూలు వాడేవారు. ఇవి చర్మానికి ఎంతో శోభ తెచ్చేవి. మోదుగు పూలతో రంగులు తయారు చేసుకుని హోలీకేళిని జరుపుకునే వారు. మోదుగు పూలు ఈ కాలంలో వచ్చే రోగాలకు కూడా దివ్యమైన ఔషధం.

## సహజ రంగులనే ఉపయోగిద్దాం..

- సురక్షితంగా - సంప్రదాయబద్ధంగా హోలీ వేడుకలు జరుపుకుందాం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు జిల్లా ఎస్పీ డి.జానకి



సహజ రంగులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 2 ప్రభాతవార్త:** హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులను ఉపయోగిస్తూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి సూచించారు. పండుగ సందర్భంగా ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. వాహనాలపై లేదా ఇష్టం లేని వ్యక్తులపై బలవంతంగా రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. బైకులు, కార్లలో గుంపులుగా తిరుగుతూ పెద్ద శబ్దాలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. యువత వాహనాలు నడిపేటప్పుడు అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతా సమస్యలు తలెత్తకుండా సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360కు సమాచారం అందించాలని సూచించారు. హోలీ అనంతరం చెరువులు, లోతట్టు ప్రాంతాలు, ప్రాజెక్టుల వద్ద స్నానాలు చేసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలని, ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. రంగుల హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసు శాఖ తరఫున హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- అందరూ కలిసి మెలసి మెలగాలి
- రంజాన్ పండుగ శాంతి కమిటీ సమావేశంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు



రంజాన్ పండుగ శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

**మహబూబ్‌నగర్ క్రైమ్, మార్చి 2 ప్రభాతవార్త:** పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అందరూ కలసి మెలసి మెలగాలని డి.ఎస్.పి వెంకటేశ్వర్లు సూచించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో శాంతి కమిటీ సమావేశాన్ని డి.ఎస్.పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలోవన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టౌన్ ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్ ముస్లిం మత పెద్దలు, హిందూ మత పెద్దలు శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ సమాజంలో మత సామరస్యం అత్యంత ముఖ్యమని, ఎలాంటి మత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, కలిసిమెలిసి ప్రతి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిం చేందుకు అందరూసహకరించాలని కోరారు. అపోహలు, వదంతులు, వివాదాలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని, ఏవైనా సమస్యలు తలెత్తినపుడు వెంటనేసమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేయడం, మతపరమైన ఫేక్ న్యూస్‌లను సృష్టించడం లేదా ఫార్వర్డ్ చేయడం వంటి చర్యలపై పోలీసులు కఠినంగా నిఘా ఉంచినట్లు డి.ఎస్.పితెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ప్రజలుబాధ్యతాయుతంగా సోషల్ మీడియాను వినియోగించుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులను షేర్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. శాంతి కమిటీ సభ్యులు కూడా శాంతి భద్రతలపరిరక్షణకు పూర్తిసహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై పోలీసు అధికారులు స్పందించాలి

- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- సమస్యలు విన్న వెంటనే ఫోన్ ద్వారా అధికారులకు ఆదేశాలు జారి
- సోమవారం ప్రజావాణిలో 20 ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి, మార్చి 2 ప్రభాతవార్త:** ప్రతి సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 20 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డికి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజావాణిలో మొత్తం20 ఫిర్యాదుల్లో 01 భార్యభర్తల పిర్యా దులు10 భూతగాదాల ఫిర్యాదులు09 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వున్నాయి.

## కుమ్మరిల్లా కాలువకు శాశ్వత పరిష్కారం




కాలువను పరిశీలిస్తున్న గ్రామసర్పంచ్, ఇరిగేషన్ అధికారులు

**దేవరకద్ర, మార్చి2 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని కుమ్మరిల్లా కాల్వను గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. కాల్వలో నెలకొన్న సమస్యలు, నీటి ప్రవాహంలో ఉన్న అడ్డంకులను, స్వయంగా గమనించి, కాల్వ పునరుద్ధరణకు శాశ్వత చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. వర్షాకాలంలో నీటి నిలువ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపడతామని వెల్లడించారు. గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాల్వ పనులను త్వరితగతిన చర్యలు చేపట్టేందుకు దేవరకద్ర ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా కలిసి, అవసరమైన నిధులు, పరిపాలన అనుమతులు తీసుకొని కాలువ పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తానని, సర్పంచ్ నరేష్‌కుమార్ హామీ ఇచ్చారు. ఇరిగేషన్ అధికారులు కూడా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సర్పంచ్ తో పాటు ప్రధానకార్యదర్శి కిషన్‌రావు, వార్డ్ నెంబర్ రవీందర్‌రెడ్డి, ఓబిసి అధ్యక్షులు ఆంజనేయులు, బేరి నాగన్న, లక్ష్మణ్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టివేత

**మాగనూర్, మార్చి 2 ప్రభాతవార్త:** నిషేధిత గుట్కా ప్యాకెట్లను సోమవారంమాగనూర్ పోలీసులు పట్టుకున్నారు. గుట్కా ప్యాకెట్లు కిరణా షాపులకు సప్లై చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో మండలంలోని వడ్వాట్ గ్రామంలో వాహనాన్ని దాడి చేసి పట్టుకున్నామన్నారు. వాహనంలో పరిశీలించగావివన్ టొబాకో, గుట్కా, విమల్ పాన్ మసాలా వంటి నిషేధిత పదార్థాలు దొరికినట్టు తెలిపారు. వాటి విలువ5370 రూపాయలు ఉంటుందన్నారు. పర్మిషన్ లేకుండా నిషేధిత పదార్థాలను సప్లై చేస్తున్న వాహనాన్నిసీజ్ చేసినట్లు తెలిపారు. యజమానిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ అర్జున్ తెలిపారు.

## మోదుగ పువ్వుతో ఎర్రబారిన అడవి



అడవిలో విరబూసిన మోదుగ పువ్వు

**వీపనగండ్ల మార్చి2, ప్రభాతవార్త:** వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకున్నటువంటి సందర్భంలో ప్రకృతిలో అనేక చెట్లు గుట్టలు న్నట్లు మనకు ప్రతిబింబిస్తాయి. ఈ కోవాలనే శశిర వసంత రుతువుల ఆగమనంతో ప్రకృతిలోని ఉన్న అడవిలో నిత్యం ఎదుగుతుండేట టువంటి మోదుగ చెట్టు మీ ఋతువులలో ఆకు రాలే సమయంలో ఆకులంతా మూడు వారి రాలిపోవడంతో ఆ చెట్టుకు వచ్చే మోదుగ పువ్వు ఎంతో ఆనందాన్ని ఇవ్వడంతో ప్రకృతి లోనికి తన సువాసన వెదజల్లుతూపసుపు కలరు మరియు ఎరుపు కలర్‌తో కూడుకొనేటటు వంటి పువ్వు పరిఢ విల్లుతుంది ఈ పువ్వు అడవిలో మోదుగ చెట్లకు చూస్తే అడవి మొత్తం ఎర్రబారినట్లు ఆస్వాదిస్తుంది సాయంత్రం వేళలో సూర్యుడు ఎర్రబారి అడవిని అంతా ఎర్రగా చేస్తున్నాడా అని విధంగా కానవస్తుంది ఈ పువ్వు ద్వారా హోలీ పండుగలకు రంగులు కలుపుకొని హోలీ పండుగ ఘనంగా నిర్వహించుకుంటారు ప్రకృతికి విరుద్ధమైనటువంటి ఆయులు రంగులు తదితర వాటినే వాడడం వల్ల చర్మవ్యాధులుకండ్లు పోవడము మనిషి రకరకాల రోగాలకు గురికావడం జరుగుతుందని సైంటిస్టులు డాక్టర్లు చెపుతున్నారు అయినా కానీ హోలీ పండుగకురకరకాల కలలను వాడడం వల్ల ఇబ్బందులు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మోదుగ పువ్వు కలర్లు వెదజల్లు కోసంకాక ఆయుర్వేద వైద్యానికి కూడా ఈ మోదుగ పువ్వు ఉపయోగపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు ఇంత వైవిధ్యం కలిగినటువంటి మోదుగ పువ్వు అడవిలో చుపర్లకు ఎంతో అందంగా కానరావడం విశేషం.

## రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిసిన శివసేనరెడ్డి




**వనపర్తి, మార్చి2 ప్రభాతవార్త:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో డిసిసి అధ్యక్షుల కోసం నిర్వహించిన సంఘటన సృజన్ అభియాన్ శిక్షణ శిబిర కార్యక్రమాన్ని నిర్విరామంగా పది రోజులపాటు నిర్వహించారు. డిసిసి అధ్యక్షులకు, పార్టీ నాయకుల దిశనిర్దేశించే ముగింపు కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సోమవారం వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిభిరంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాహుల్ గాంధీనీ రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. రాహుల్ గాంధీ, శివసేనరెడ్డితో రాష్ట్రంలో క్రీడా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్నక్రీడాంశాలపై, జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం శిక్ష శిబిరంలో సంస్థాగత బలోపేతం, నాయకత్వానికి సంబంధించిన సామర్థ్యాల, బూతు స్థాయి నుండి పార్టీని పటిష్టంగా చేసే దిశగా ఈ యొక్క శిక్షణ శిబిరం ఎంత దోహదపడుతుందన్నీ డిసిసి అధ్యక్షులకు సూచించారు.

## పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు గుర్తించి.. బాధితులకు అప్పగించిన పోలీసులు



బాధితులకు ఆభరణాలు అందజేస్తున్న పోలీసులు

**మక్తల్ టౌన్, మార్చి2 ప్రభాతవార:** మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తేది సోమవారం మధ్యాహ్నం సుమారు 02:00 గంటల సమయంలో కృష్ణ మండలం కున్సి గ్రామానికి చెందిన బూదూరోళ్ల ఆర్తి సాగర్ నిరంజన్ సాగర్ మక్తల్ పట్టణంలోని ఒక జ్యువెలర్స్ షాప్ నుండి వివాహ కార్యక్రమం నిమిత్తం ఒక జత బంగారు కమ్మలు, ఒక బంగారు ముక్కుపుడక మరియు ఒక జత వెండి మెట్టెలు కొనుగోలు చేసి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో మక్తల్ పట్టణంనారాయణపేట క్రాస్‌రోడ్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఆభరణాలు ఉన్న బ్యాగ్ పోగొట్టుకున్నట్లు గుర్తించారు. వెంటనే బాధితులుమక్తల్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేశారు. సమాచారం అందు కున్న వెంటనే మక్తల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, మరియు సిబ్బంది సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆభరణాలను గుర్తించి సురక్షితంగా స్వాధీనంచేసుకున్నారు. తదుపరి వాటిని బాధితునికి అప్పగించగా, వారు మక్తల్‌పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు విలువైన వస్తువులు తీసుకువెళ్తున్నప్పుడు మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## ఆదర్శ విద్యాలయంలో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**శ్రీరంగాపూర్, మార్చి2 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయం పాఠశాలలో సోమవారం విద్యార్థిలే ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించడం జరిగింది. మంచి బోధనోపకరణాలతో ఆకర్షణీయంగా బోధన నిర్వహించారు. ఒక్కరోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సుశాంత్ చంద్ర, డీఈవోగా చైత్ర ప్రియ, ఎంఈఓ గా గణేష్ బాధ్యతలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్, ఉపాధ్యాయులు భరత్, భీనా కృష్ణ, ప్రభావతి, సేచీన, పుష్పలత, రాధమ్మ, పార్వతి, అరుణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్

పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ, మార్చి 2 ప్రభాతవార్త:** మండలంలోని బర్కత్‌పల్లి గ్రామ సర్పంచ్ మల్కేడి నవ్య రాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి సోమవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వారికి పార్టీ కండువా కప్పిసాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు వార్డు మెంబర్లు మొగిలి జంగయ్య, కోడెల సంతోష, గౌడుగు అలివేల శ్రీను, గౌడుగు నరసింహ, గౌడుగు కొండల్ లు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.కార్యక్రమంలో వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్, సర్పంచ్‌లు సంగీత శేఖర్ రెడ్డి, కేశమల్ల అనుష కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్క రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**-మున్సిపల్ కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్**

చిన్నారులకు, గర్భిణులకు గుడ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మార్చి 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టిక పదార్థాలను చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ సూచించారు. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన గర్భిణీ స్త్రీలకు చిన్నారుల తల్లులకు పౌష్టిక ఆహారంతో పాటు గుడ్లు,పాలు,పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రటీచర్ ప్రతిమా, సిబ్బంది మున్సిపల్ కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంతియాజ్ ఖాన్, మల్లికార్జున్,శివ,తదితరులు పాల్గొన్నారు.

## పేకాట నిర్వహిస్తున్న నలుగురు అరెస్ట్

**- నగదు, వాహనాలు స్వాధీనం - మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్**

నగదు,సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**మద్దూరు, మార్చి 2 ప్రభాత వార్త:** మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపల్లి మండలం, కొత్తపల్లి గ్రామ పరిధిలో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మద్దూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టారు.ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి రూ.5,400 నగదు, 52 ప్లేయింగ్ కార్డులు, 2 మొబైల్ ఫోన్లు, 2 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్ట్ చేసిన వారిని 1) రాంరెడ్డి, 2) జి.పర్వత్ రెడ్డి, 3) జాఫ్రి, 4) శ్రీనివాస్ రెడ్డిగా గుర్తించారు. వీరిపై గేమింగ్‌యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎస్సై, ప్రజలుచట్ట విరుద్ధ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.పోలీసుల చర్యల తో ప్రాంతంలో చట్టవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

## నూతన వార్డు సభ్యులకు శిక్షణ

మాట్లాడుతున్న ఎంపీవో వెంకట్రాములు

**రాజాపూర్, మార్చి 2 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు సోమవారం ఎంపీవో వెంకట్రాములు ఓరియంటేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీలోని నాయకత్వ లక్షణాలు, పంచాయతీ చట్టం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల విధి విధానాల గురించి వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యులు విధిగా పాల్గొంటూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, రాజాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్‌ను సన్మానించిన రెడ్ క్రాస్ సొసైటి సభ్యులు

**గద్వాల మార్చి 2, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సంగాల అయ్యపు రెడ్డి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక సభ్యులు కలిసి కలెక్టర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా జోగులాంబ గద్వాల జిల్లాకు వచ్చిన కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఐఏఎస్ అధికారిని జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసిశాలువా కప్పి పూల బోకే, పూల మొక్కను ఇస్తూ ఘనంగా సన్మానించారు. అనంతరం కలెక్టర్ తో చైర్మెన్ అయ్యపు రెడ్డి రెడ్ క్రాస్ గురించి తెలియజేస్తూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఇండియన్‌రెడ్ క్రాస్‌సొసైటీ చేస్తున్న కార్యక్రమాలకు, ప్రజలకు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులకు, సోషల్ ఆక్టివిటీస్ కార్యక్రమాలకు మీ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ రెడ్ క్రాస్ ద్వారా చేస్తున్నటువంటి సమాజ సేవకు ఉపయోగపడే కార్యక్రమాలకు మా సంపూర్ణ సహాయ సహకారాలు వుంటాయని తెలిపినట్లు అయ్యపు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యులు జి.రమేష్,జిల్లా వైస్ చైర్మన్ ఎండి తహేర్, జిల్లా కోశాధికారి గట్టు ధనలక్ష్మి ,జిల్లా కార్యనిర్వాక సభ్యులు జి.గంగాధర్ గౌడ్,అప్సర్ పాషా ,అక్బర్ బాషా,బండారిపాలుసుధాకర్, మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అయ్యపురెడ్డి, కార్యవర్గ సభ్యులు

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధం
- ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలపై కఠిన చర్యలు
- వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి

**వనపర్తి, మార్చి 2 ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజల సాధారణ జీవనాన్ని నిరంతరాయంగా కొన సాగించడం, అనవసర గుమికూడింపులు నివారించడం లక్ష్యంగా మార్చి 01 నుంచి మార్చి 31 వరకు 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉం టుందని జిల్లా ఎస్పీ సునితరెడ్డి, ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా పరిధిలో ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవరైనా పోలీసు ఉన్న తాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం. ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటిలేదు" అని స్పష్టం చేశారు. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి.అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండాచర్యలు తీసుకుంటాం.నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి..అందరూ తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసిఅనుమతి పొందండి. ప్రజలసహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి. పోలీసుల చర్యలు ప్రజల రక్షణ కోసమేనని ఎస్పీ తెలిపారు.

# కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

**-మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్**

**కల్వకుర్తి, మార్చి2 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కౌన్సిలర్లతో కలిసి కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కల్వకుర్తి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు విన్నవించారు. అనంతరం కల్వకుర్తి మున్సిపాలిటీలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణ సముదాయలను పెంచాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు మబ్బు రామరాజు,కుడుముల అస్మిత చంద్రకాంత్‌రెడ్డి, కోడెల లలిత గణేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, చిన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయిలు, దళిత నాయకులు రావుల కేశవులు, పంబళ్ల కుమార్, బంగారి, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, ఏనుగొండ నరేందర్, కృష్ణ, శ్రీను, పరశురాములు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

# ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 2 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, సాగునీటి శాఖల అధికారులతో కలిసి భూసేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. జిల్లాలో అమలులో ఉన్న ప్రాధాన్య ప్రాజెక్టులు అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, అలాగే అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, న్యాయబద్ధంగా భూసేకరణ ప్రక్రియ కొనసాగించాలని ఆయన సూచించారు. భూ యజమానులతో సమన్వయం చేసుకుని,వారికి చెల్లించాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ కేసులు, వివాదాలు, సర్వే ప్రక్రియలు త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి దశలో సమన్వయం పెంచుకుని నిర్ణీత గడువులో పనులు ముగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అవసరమైతే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు తమ బాధ్యతలను గుర్తుంచుకుని ప్రభుత్వ లక్ష్యాల సాధనలో చురుకుగా పనిచేయాలని, ప్రతి వారమూ పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్ రెవెన్యూ, సాగునీటి శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**మద్దూరు, మార్చి2 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఏబీవీపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హిందూ ధర్మంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి,భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో బహుమతులు అందజేశారు.కార్యక్రమానికి హాజరైన వక్త రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. చికాగోలో జరిగిన ప్రపంచ మత సదస్సులో హిందూ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు వివేకానందఅని గుర్తుచేశారు. గురువు లేని విద్యగుడ్డి విద్యతో సమానంఅని, విద్యార్థులు తల్లి దండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. భగవద్గీతలోని ధర్మబోధలు క్రమశిక్షణ, విలువలను పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏబీపీ కన్వీనర్ నరేష్, ఎస్సై విజయ్ కుమార్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు దినేష్, నర్సింలు, సంగీత శివకుమార్, గోపాల్,మోలానా, లింగానాయక్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వేణు గోపాల్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కాలప్ప, సాయప్ప, ఏబీపీ నాయకులు, శ్రీహరి శ్రీనుశివ ప్రశాంత్ పురుషోత్తం మహేష్ శివ, సూర్యకిరణ్, నిఖిల్ ,బిజెపి నాయకులు సాయిలు ,భరత్ కుమార్, రఘు, కాశప్ప హరీష్,భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటపాట ప్రోగ్రాంకు నాగసానిపల్లి గ్రామవాసి

**శ్రీరంగాపూర్, మార్చి2 ప్రభాతవార్త:** ఆటపాట అనే పల్లె పాట ప్రోగ్రాంలో క్వార్టర్ ఫైనల్‌కు శ్రీరంగాపూర్ మండలం లోని నాగసానిపల్లి గ్రామానికి చెందిన అరుణ ఎంపిక కావడం జరిగింది. అరుణ ఫోక్ సింగర్‌గా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమం బుధవారం రాత్రి 8 గంటలకు డిడి యాదగిరి ఛానల్ లో లైవ్ రావడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి సింగర్‌గా ఎంపిక కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందని ముందు ముందు తాను ఇలాంటి మంచి ప్రోగ్రాములు చేస్తూ గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని అరుణకు అభినందనలు తెలియజేయడం జరిగింది.

## కనుల పండువగా కళ్యాణోత్సవం

**బిజినేపల్లి, మార్చి2 ప్రభాతవార్త:** మండలంలోని వట్టెం నారదగిరి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామపురోహితులు అభ్యుదయ హిందూ సేవాసమితి గ్రామ పెద్దలు, ప్రజలు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వందలాదిగా కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కీ.శే. కోర్త లక్ష్మారెడ్డి వంశస్థులు ప్రతిసంవత్సరంలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణోత్సవంతో పాటు జాతరకూడా ప్రారంభం కావడంతో వట్టెం గ్రామం సందడిగా మారింది.

## పదో తరగతి విద్యార్థులను ప్రోత్సాహస్తున్న పూర్వ విద్యార్థులు

**భూత్పూర్,మార్చి 2,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని విద్యార్థులు,ఉపాధ్యాయులు ఎంతో ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు సైన్స్ మాడల్స్ ప్రదర్శనలు,వర్కింగ్ మోడల్స్, రకరకాల శాస్త్రీయ ప్రయోగాల ప్రదర్శనలు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు.పండని పంటలు,సైన్స్ రంగోలి కార్యాక్రమాలతో విజ్ఞాన శాస్త్ర విభాగాలకు సంబంధించిన బొమ్మలు గీసి విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.విటమిన్ల ఆవశ్యకత,వాటి ఉపయోగాలపైన ఏడో తరగతి విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు.ఆరో తరగతి విద్యార్థిని విద్యార్థులు మాజీ రాష్ట్రపతి,మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన స్వర్గీయ అబ్దుల్ కలాం జీవితంపై నృత్యాన్ని ప్రదర్శించారు.మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా నాటక ప్రదర్శన నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బైకాని బాలు యాదవ్,పద్మజతో పాటు ఇతర ఉపాధ్యాయులు శారద,రమేష్,చెన్నయ్య,వెంకటేష్,లక్ష్మి,స్వరూప,శోభ తదితరులు పాల్గొన్నారు.

## గోవు మృతి

**అంతక్రియల నిర్వహించిన మక్తల్ బజరంగ్ దళ్ కార్యకర్తలు**

**మక్తల్ టౌన్, మార్చి 2 ప్రభాత వార్త:** మక్తల్ పట్టణంలో గోవు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బజరంగ్ దళ్ కార్యకర్తలు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చికిత్స చేయించడం జరిగింది. సాయంత్రకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న గోవు మృతి చెందడం జరిగింది. మున్సిపల్ సిబ్బందితో బజరంగ్‌దళ్ కార్యకర్తలు తీసుకెళ్లి అంతక్రియలు పూర్తి చేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రఖండ సాహ సంయోజక్ మూర్తి,ప్రఖండ గోరక్ష సంయోజక్ అనిల్,అక్షయ్,నాగరాజు,నవీన్,వెంకు, రాము, శివ, చెన్నకేశవులు బజరంగ్ దళ్ కార్యకర్తలు ఇతరతులు పాల్గొన్నారు.

## డీసీఎం ఢీకొని ఆర్టీసీ కాంట్రాక్ట్ డ్రైవర్ మృతి

**వెల్దండ, మార్చి 2 ప్రభాతవార్త:** డీసీఎం వాహనం ఢీకొని కల్వకుర్తి ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు డ్రైవర్‌గా విధుల నిర్వర్తిస్తున్న వద్యావత్ గణేష్ (29) మృతి చెందిన సంఘటన మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల నక్షత్ర హోటల్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గానుగట్టు తాండ గ్రామపంచాయతీ పరిధిలోని వంటి గుడిసె తాండాకు చెందిన గణేష్ కల్వకుర్తి ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన సొంత పనులపై గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కల్వకుర్తి వైపు నుండి వస్తున్న డీసీఎం ద్విచక్ర వాహనంపై వస్తున్న గణేష్‌ను ఢీకొనగా తలకు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్ ద్వారా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య చిట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆరు నెలలని తొమ్మిది నెలలైంది..

- ముంపు బాధితుల గోస తీరలే..
- ఉదండాపూర్ వాసుల ఆందోళన

**జడ్చర్ల, మార్చి 2 ప్రభాతవార్త:** ఉదండాపూర్ ముంపు గ్రామ బాధితుల గోస తీరడం లేదని పంపు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పరిహారం డబ్బులు ఇసామని చెప్పి ఆరు నెలల్లో ఇస్తామని చెప్పి తొమ్మిది నెలల అయినప్పటికీ ఎటువంటి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉదండాపూర్ గ్రామ ప్రజలు ధర్నాకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు తమకు తమకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జడ్చర్ల తహసీల్దార్, డీటీకి వినతి పత్రంఅందజేశారు.రెండు రోజులలో ధర్నాలు చేస్తామని అనుమతి ఇవ్వాలని వినతి పత్రాన్ని అందజేశారు.

తహసీల్దార్, డిటి, సిఐలకు వినతి పత్రం సమర్పిస్తున్న ముంపు బాధితులు

## తుమ్మన పేట గ్రామంలో పెళ్ళి సందడి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ వ్రతంలో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి ఆశీర్వాదాలు పొందారు. తన వివాహం అనంతరం తొలిసారి సతీమణితో కలిసిస్వగ్రామానికి చేరుకున్న విజయ్‌కు చిన్ననాటి స్నేహితులు హృదయపూర్వక స్వాగతం పలికారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ గ్రామ వీధుల్లో కాసేపు కలియ తిరిగారు.ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా బాదావత్ సంతోష్ దంపతులు, ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు కలిసి నూతన దంపతులను ఆశీర్వదించారు. అదే విధంగా కలెక్టర్ దంపతులు నూతన వధువరులకు జ్ఞాపికను బహుకరించారు. అచ్చంపేట నియోజకవర్గంలోనివివిధ రాజకీయ పార్టీల ముఖ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గ్రామాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం ఆకాంక్షించారు.తెలంగాణలోని మారుమూల గ్రామంలో జన్మించిన విజయ్ స్వశక్తితో సినీ రంగంలో ఎదిగి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం గ్రామస్తులకు గర్వకారణమైందని గ్రామపెద్దలు పేర్కొంటున్నారు. ఆయన ప్రయాణం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. సినిమా రంగం వారిని కలిపిందని అభిమానులు భావిస్తారు. అభిమానులు ప్రేమగా పిలిచే విరోష్ అనే పేరునే తమ వివాహ వేడుకకు ప్రతీకగా నిలిపిఅభిమానులకు ప్రాధాన్యం ఇచ్చిన ఈ జంట, దేశవ్యాప్తంగా పలు నగరాల్లో స్వీట్లు పంపిణీ చేసి అభిమానుల ఆశీర్వాదాలు పొందిన విషయం తెలిసిందే. ఇప్పుడు వివాహానంతరం స్వగ్రామ సందర్శనతో గ్రామంలో ఉత్సాహం మరింత పెరిగింది. తుమ్మనపేట గ్రామం సోమవారం ఆహ్లాదభరిత దృశ్యాలతోకళకళలాడింది. సాంప్రదాయ సంగీతం, సంబరాలు, హర్షధ్వానాల మధ్య గ్రామం మొత్తం ఒక మహోత్సవ వాతావరణాన్ని సృష్టించింది. విజయ్ దేవరకొండ-రష్మిక మందాన జంట రాకతో గ్రామ చరిత్రలో చిరస్మరణీయమైన రోజు నమోదైంది. యువతీయువకులు మొబైల్‌ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.

## కన్నతల్లే కడతేర్చింది

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నీలమ్మ తల్లిదండ్రుల వద్ద ఉంటుండగా జనవరి 4న కుమారుడు జన్మించగా గత నెల 27 తేదీన నరేందర్‌తో పాటు, నీలమ్మ అత్త మామ పాలెం గ్రామానికి వచ్చి పంచాయతీ పెట్టి కాపురానికి రావాలంటూ కోరిన నిరాకరించినట్లు వివరించారు. భర్తతోపాటు అత్తమామలు వెళ్లిపోవడంతో అదే రాజు రాత్రి నిద్ర అనంతరం రెండు గంటల ప్రాంతంలో మూడు నెలల బాలుడిని ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడవేసి కన్న తల్లే కడతేర్చింది అని డీఎస్పీ వెల్లడించారు. బాలుని హత్య చేసి భర్త కుటుంబీకులపై నెట్టే ప్రయత్నం చేయగా కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేయగా అసలు విషయం వెలుగు చూసిందని పోలీసులు వెల్లడించారు. పత్రికా సమావేశంలో సీఐ అశోక్ రెడ్డి ఎస్ఐ కే శ్రీనివాస్ తదితరులున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్ లైన్ లో నమోదు చేసి వారంలోగా పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని దరఖాస్తులకు తగిన కారణాలు పేర్కొంటూ నిబంధనల ప్రకారం తిరస్కరించాలన్నారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వికలాంగులు వయోవృద్ధులకు వీల్ చైర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజావాణిలో తమ అర్జీలను ఇచ్చేందుకు వచ్చే ప్రతి ఒక్కరికి వరుస క్రమంలో టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజావాణిలోతమ ఫిర్యాదులను తెలియజేసే ఆయా మండలాల ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు సంబంధిత ఎమ్మార్వోలు, ఎంపీడీవోలను కూడా భాగస్వాములను చేస్తూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి అప్పటికప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నందున ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చే చాలామంది ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక అయోమయంలో ఉంటున్నారని, వారికి సహకారం అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఒక అధికారిని నియమించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయుడు

**కల్వకుర్తి, మార్చి 2 ప్రభాతవార్త:** ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నాగర్‌కర్నూలు జిల్లా చెందిన నేనావత్ జాను ఎంపికైనట్లు తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోచ్ వసంత్ కుమార్, మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.5 నుంచి 8 వరకు చండీగఢ్‌లో నిర్వహించే ఆలిండియా పోటీల్లో ఆయన పాల్గొననున్నారు. ప్రస్తుతం ఆయన వెల్దండ మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయన ఎంపిక పట్ల జిల్లా విద్యాశాఖా ధికారిఎ.రమేష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రంగుల కేళి హోళీ

**మొదటి పేజీ తరువాయి భాగం..**

విష్ణుభక్తులై ఉంటారా?లేక మూడు జన్మలు విష్ణుద్వేషులుగా ఉంటారా? తేల్చుకోండని సనత్‌కుమారులు జయవిజయుల్ని అడుగగా,విష్ణువును వీడి ఏడు జన్మలు భూలోకంలో విష్ణుభక్తులై ఉండలేమని,మూడు జన్మలు విష్ణుద్వేషులమై ఉంటూ మూడు జన్మల అనంతరం వైకుంఠానికి చేరి విష్ణువుకు ద్వారపాలకులుగా ఉంటామని కోరగా,శరత్‌కుమారులు తథాస్తని దీవిస్తారట.దీంతో జయవిజయులు భూలోకంలో దితి-కశ్యపులకు హిరణ్యాక్షుడు,హిరణ్యకశ్యపుడుగా జన్మిస్తారు.హిరణ్యాక్షుడు బ్రహ్మ వరం వల్ల మదగర్వంతో భూమిని చాపగా చుట్టి సముద్రంలో దాస్తాడట .అప్పుడు తన హిరణ్యాక్షుడి భారి నుంచి రక్షించమని భూమి శ్రీమహావిష్ణువును వేడుకుందట.అప్పుడు శ్రీమహావిష్ణువు వరాహరూపం ధరించి హిరణ్యాక్షుని వధించి భూదేవిని రక్షిస్తాడట.తన సోదరుని వధించాడన్న కోపంతో హిరణ్యకశ్యపుడు బ్రహ్మచే వరం పొందుతాడట.విష్ణు అంశతో జన్మించిన ప్రహ్లాదుడు తన శత్రువైన నారాయణ జపం చేస్తుండడంతో సహించని హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని చంపేందుకు నిశ్చయించుకుని పలు రకాలుగాహింసిస్తూ చంపేందుకు ప్రయత్నిస్తాడు.అయితే ప్రహ్లాదుని విష్ణుమూర్తి అన్ని సందర్భాలలో రక్షిస్తూ వస్తుండడంతో హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని వధించమని తన సొంత చెల్లెలు హోళికను పంపుతాడట.హోళి పండుగ పౌర్ణమి రోజున కామదహనం చేస్తారు.ఇందుకు ఓ కారణం లేకపోలేదు.దేవతలను హింసించే తారకాసురుని సంహరించేందుకు శివపార్వతులకు శివతేజస్సుతో కల్గిన పుత్రుడే అయి ఉండాలనే వరం తారకాసురునికి ఉండడంతో శివపార్వతులను సంసార పరంగా మారడానికి దేవతలు మన్మథుడిని వేడుకోగా,మన్మథుడు కాముడిగా మారి యోగముద్రలో(ధ్యానంలో)ఉన్న పరమశివుడిపైన మన్మథ బాణాన్ని ప్రయోగిస్తాడట.ఆగ్రహించిన పరమేష్టి తన మూడో కన్నుతో మన్మథుని భస్మం చేస్తాడు.తన భర్త దహనాన్ని తట్టుకోలేని రతి తన భర్తను రక్షించాలని శివుడిని వేడుకుంటుందట.శాంతించిన పరమశివుడు భస్మమైన మన్మథుడికి ఆత్మరూపంతో రతికి కన్పిస్తాడని వరం ప్రసాదిస్తాడట.ఈ సంఘటన ఫాల్గుణ శుక్లపక్ష పౌర్ణమి రోజున జరిగిందని,అందుకే కాముడు దహనమైన పౌర్ణమిని కాముని పౌర్ణమి అని అంటారని ప్రతీతి.రేపల్లెలో యశోద వద్ద చిన్ని కృష్ణుడు పలు లీలలు ప్రదర్శిస్తాడు.కంసుడు చిన్ని కృష్ణుని చంపేందుకు పూతన అనే రాక్షసిని పంపుతాడట.అయితే భగవంతుడైన చిన్ని కృష్ణుడు పూతన ఇచ్చిన విషం పాలను తాగి నల్లగా మారుతాడట.చిన్ని కృష్ణుడు తనను గోపికలు నల్లనివాడని గేలి చేస్తున్నారని,రాధ తెల్లగా ఉందని చెప్పగా,తల్లి యశోద రంగులు చేతికందించి రాధతో పాటు గోపికలకు రంగులు చల్లి పూయాలని అపుడు రాధ కూడా ఈ రంగుల్లో నీలి రంగుకు మారుతుందని సెలవిస్తుందట.నాటి నుంచి రంగుల పండుగ హోళి బహుళ ప్రాముఖ్యంలోకి వచ్చిందని చెబుతుంటారు.